# వంచన

చిన్న పట్టణాన్ని వదలి పెద్ద పట్టణానికి ఎవరూ తోడు లేకుండా రావడం ప్రభకి యిదే మొదటిసారి. ప్రభ చిన్నతనంలో ఎన్నోసార్లు అనుకొనేది - ఒక్కర్తెనీ అమ్మా, నాన్నా ఎక్కడికేనా వెళ్ళనిస్తే బాగుండుననీ. కాని అమ్మదీ నాన్నదీ వింతతత్వం. అమ్మవి నాన్నవి వింతపోకడలు. ఆడపిల్ల ఒక్కర్తీ ఎక్కడికేనా వెడుతుందంటే భయం. వెళ్ళనిచ్చి చూద్దామంటే భయం. వెడితే ఎలాగుంటుందోననీ, వెళ్ళనిస్తే బాగుండుననీ ప్రభ కోరిక. ఆ కోరిక నాన్న బ్రతికి వున్నన్నాళ్ళూ అలాగే వుండిపోయింది. నాన్న అసాధ్యుడు. అమ్మని ఎలాగేనా ఒప్పించవచ్చు. నాన్న చేత వూ అనిపించేసరికి తలప్రాణం తోకకి వస్తుంది. అందుకే అమ్మ తిరిగి ప్రభనే కోప్పడేది. ప్రభ అమ్మను వేధించుకుతింటే మాత్రం ఏం లాభం? ఏం చేస్తుంది అమ్మమటుకు? అమ్మకి కూతురి కోర్కె తీర్చాలనివున్నా నాన్న చంపేస్తాడేమోనని భయం. అందుకే ఆ ఇల్లో జైలులా, అమ్మా తనూ ఖైదీలులాగా, నాన్న జైలరులాగా అనుకొనేది ప్రభ. మనుషులైన ఈ ఇద్దరినీ వదిలి, అన్ని బంధాలూ తెంచుకొని నాన్న ఈ లోకం విడిచిపెట్టాడు. అమ్మని అందరూ ఓదార్చేవాళ్ళే. కాని ఎక్కడో మహా విద్వాంసులకు కాని పట్టుపడని అపస్వరంలా అమ్మమీద ఏదో దోషమున్నట్లు లీలగా సూచిస్తుండేవారు-చుట్టాలు, తెలిసినవాళ్లు. నాన్నజీవితం ముగియడానికి అమ్మకాదే కారణం! అయినా అమ్మ ఎక్కడో సరి

సావిత్రీ, భర్త తులసీ కాలేకపోయిందని వాళ్ళబాధ. పాపం! అమ్మేం చేస్తుంది? ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకుంటుంది. ఏమిటీ అమ్మ పిచ్చి అనిపించేది ప్రభకి. నాన్న చనిపోయాడంటే ఏదో మహదవకాశం లభించినట్లు అనిపించేది ప్రభకి. అలాంటిది అమ్మెందుకు బాధపడుతుంది! ధైర్యంగా ఊపిరైనా తీసుకోనీయని నాన్న, ఎన్నడూ అమ్మతో సరదాగానైనా మాట్లాడని నాన్న, జైల్లో పెట్టినట్లు అట్టే పెట్టకపోతే ఆడపిల్లలు చెడిపోతారని తమ ఉత్సాహాన్నంతా చల్లార్చిన నాన్న చనిపోతే ఏమి? — అనిపించింది ప్రభకి. కాని అమ్మమటుకు అలా అనుకోవడం లేదు. అమ్మ పూర్వకాలపుది, భర్త లేని హిందూ స్త్రీ బ్రతుకే వృథా అని అమ్మ నమ్మకం. నాన్నగారి మృతితో పాటే అమ్మ జీవితంలో ఆశలు మృతిచెందాయి. అమ్మ దృష్టిలో తన బాధ్యత ఒక్కటే యిప్పుడు: ఈ ప్రభని ఏ అయ్యచేతిలోనో పెట్టేసి తాను నిశ్చింతగా మృత్యుదేవత ఆహ్వానంకోసం ఎదురుచూడడం. ఈ లక్ష్యశుద్ధికోసం అమ్మ అహర్నిశలూ ఆలోచిస్తూనే వుంటుంది. ప్రభకిమటుకు హాయిగావుంది. వీధి అరుగుమీద నుంచుని వచ్చేపోయే వాళ్ళని చూస్తూ హాయిగా కాలక్షేపం చేద్దామంటే కళ్ళురిమి చూసే నాన్న లేడు. అందుకే హాయిగా అరుగుమీద నుంచునేది. ఎవరు యీ పక్కచూచినా, తన కేసి, తన ముఖాన్ని కప్పేసే కళ్ళకేసీ, గమ్మత్తుగా ఒంపుతిరిగిన తన పెదవుల కేసీ, ఆకృతిలో చిన్నదే అయినా బంగారువన్నెతో మిసమిసలాడే తన శరీరం కేసీ చూస్తున్నారని తలపోసేది

ప్రభ. తలపోయడమేమిటి? నమ్మేది. ప్రభ ఇన్నాళ్లూ ఏ ఒక్కరికీ తెలియదు, యింతటి అందకత్తె యీ చిన్న ఇంట్లో పంజరంలో పక్షిలా వుంటూందని. అందుకే ఇప్పు డందరూ యింత ఆశ్చర్యంగా ఆమె వునికి అక్కడ నమ్మకం లేనట్లుగా చూస్తున్నారు పిచ్చివాళ్ళు! వాళ్ళందరూ చూడాలనీ, వాళ్ళందరినీ తను చూడాలనీ ఎంత తాపత్రయపడిందో ప్రభ! వీళ్ళకి ఎలా తెలుస్తుంది ?

రోజూ ప్రభ చూసే అనేకులలో యితనెంత బాగుంటాడు! చూడ్డాని కెంత బాగున్నాడో అనుకుంది ప్రభ. అమ్మ యింట్లో రామాయణం చదువుకుంటూవుంటే మధ్యాహ్నంవేళ అరుగుమీద నుంచుని చూస్తూంటే — ఈ వ్యక్తి అదే రోడ్డువెంట ఎన్నిసార్లు తిరిగేవాడని! 'నీకోసం ఈ రోడ్డువెంట యిన్నిసార్లు తిరుగుతున్నాను. నిన్ను రోజూ ఒక్కసారేనా చూడకపోతే నాకు తోచదు' అని తనతో చెప్పకూడదూ ? అనుకునేది ప్రభ.

అదే జరిగింది. అతను చెప్పనూ చెప్పాడు. ఆ మాటలు ప్రభ చెవులకి అమృతవర్షంలా తోచనూ తోచాయి. ఆమె హృదయంలో ఏవేవో ఎండిన మోడులు చిగురించాయి. శరీరం యౌనత్తూ వింత వన్నెలు ఒలుకపోసింది. దాని ఫలితమే తా నీనాడు ఒంటరిగా యీ పట్నానికి రాడానికి కారణం అని అనుకొంటూంటే ఎంత హాయిగా వుందని ప్రభకి. ఎంత చక్కటి ఉత్తరం వ్రాశాడని! రైలు టిక్కెట్టుతోసహా ఆ వుత్తరాన్ని అందుకొన్నప్పుడు ప్రభ మూగవోయిన హృదయం సంగీతం పాడింది. అమ్మకి తెలియ

కుండానే అన్నీ సర్దుకొని చల్లగా ప్రయాణం అయింది.
రైలు రాకకోసం, ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కి కూర్చోవడం
కోసం ఎదురు చూచి చూచి ప్రభ కళ్ళూ, శరీరమూ అలసి
పోయాయి. ఆ తెల్లవారుఝాము వేళ కొన్ని వేల గంటలు
గడిచాక కాని రైలు రాలేదనిపించింది. రైలు రానూవచ్చింది.
ప్రభ ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కి కూర్చోనూ కూర్చుంది.
రైల్లో గంటా గంటన్నర గడిస్తే చాలు పట్నం వెళ్ళిపోతుంది.
అంతే. ఈ ప్రపంచంలో ఇంత హాయినిచ్చే ప్రయాణా
లుంటాయని ప్రభ ఎన్నడూ వూహించనేనాలేదు. ఏమో,
నాన్న బ్రతికివున్నరోజులలో యిలాంటి ప్రయాణాలు ప్రభ
ఊహలలో మాత్రమే వుండేవి. నాన్నే సరదాగా వుండనిస్తే
యీ ప్రయాణం యింత ఉత్సాహం యివ్వలేకపోయేదేమో
అనుకుంది ప్రభ. రకరకాల ఆలోచనలతో ఆ పెట్టెలో ఒక
మూల కూర్చుంటే... సూర్యోదయపు వన్నెలూ, చల్లగాలీ
అన్నీ ఎంతో కొత్తగా వున్నాయి ప్రభకి. కాలం పయ
నిస్తున్న గుర్తేలేదు. కాని కాలం స్తంభించిపోలేదు. కాలం
పరుగెడుతూనేవుంది. అందుకే ఆ చిన్నపట్టణంనుండి బయలు
దేరిన రైలుబండి పెద్దపట్నపు ప్లాటుఫారంమీద పెద్ద గోల
చేస్తూ ఆగింది. ఆ ఆగినకుదుపులో ప్రభవూహావాహిని కట్ట
డింది. ప్లాటుఫారంమీద కాలూని దిగేసరికి కొంచెం
భయంతో శరీరం వణికింది. కాని ధైర్యం మటుకు పోలేదు.
మెల్లిగా స్టేషనుదాటి బయటికి వచ్చి రిక్షా ఎక్కింది. రిక్షా
వాడికి చెప్పింది హోటల్ అడ్రసు. ఆ హోటలు స్టేషన్‌కి
ఏమంత దూరంకాదు. ఆ హోటలులో మూడో అంతస్తులో

ఒక గది. ఎంత సుఖంగా వుందని ! స్వర్గం అంటే ఇదే అనుకుంది ప్రభ. అతను వస్తాడు. అందాకా తనొక్కర తె ఉండాలి. తరువాత ? తరువాత ఏముందీ ? హాయిగా పెళ్ళి చేసుకొనేదీ, కులాసాగానే వున్నానంటూ అమ్మకు వైరిచ్చేదీ. అంతే. దాంతో అన్నీ సర్దుకుంటాయి అని తలపోసింది ప్రభ. ఏవేవో ఊహల బరువులో హృదయం బద్దలయేలా కొట్టు కుంటూంది. రైలెక్కేముందు ప్రభకీ, ఈ ప్రభకీ ఏమీ పోలికే లేనట్లుగా వుంది. సిగ్గుతో గర్వంతో మెరిసిపోయే ఆ ముఖం అద్దంలో చూసుకొంటే...దానిలో ఆత్రుతతప్ప వేరేమీ కనిపించడంలేదు. భౌగోళిక అవధులను దాటి హృదయం ఎక్కడికో తేలిపోతున్నట్లువుంది.

ఎందరెందరో ఒచ్చిపోయే యీ హోటలుగూములో తను! ఎన్నడూ ఏ కల్మషం అంటని తను ! తను చేసింది తప్పాపనా ? లోకం ఏమనుకుంటుంది ? ... తప్పేముందీ ? లోకం ఏమిటి ? ప్రశ్నలూ, సమాధానాలూ ఒకదానివెంబడి వస్తూనేవున్నాయి, పోతూనేవున్నాయి. అలా వస్తున్నట్లూ పోతున్నట్లుకూడా తెలియడంలేదు. ప్రభ ఎదురుచూసేదంతా ఒక వ్యక్తి రాక – అంతే. వుండి వుండి ఎవరో తలుపుతట్టి నట్లయి వులిక్కిపడేది. కాని అలా ఎవరూ తలుపు తట్టలేదు. అంతా భ్రమే. అలా తలుపువంక చూస్తూ కూర్చుని కొన్ని యుగాలు గడిచాయనిపించింది ప్రభకి. అయినా ఏమిటీవ్యక్తి? ఎందుకింకా రాలేదు ? రైల్లో ఒక్కర్తీ ఎంతో ధైర్యంచేసి వచ్చిందే ! స్టేషనుకేనా వచ్చి తీసుకొని వెడతాడని అను కొందే! అలారానూలేదు, ఏంలేదు. ఇంకా రాకపోయేసరికి

ప్రభ మనస్సు చివుక్కుమంది. హోటలులో ఆ రూములో ఎంతో సేపటినుంచి వేచివున్న ప్రభకి ప్రతి అలికిడి అతని పదధ్వనిలాగే వుంది. దూరంనుండి వినవచ్చే ప్రతి మాటా అతని మాటలాగే వుంది. కాని అతనుమటుకు రాలేదు. ఎంత సేపని యిలా ఎదురుచూస్తుంది? ఎంత సేపటికి వస్తాడు... ఇలా ఆలోచించుకొంటూనేవుంది ప్రభ. ఈ ఆలోచనల ప్రవాహానికి అడ్డుతగులుతూ తలుపుతట్టిన చప్పుడు వినిపించింది. ఉలిక్కిపడింది ప్రభ. అతనే, ఇంకెవరై వుంటారు? అతనే! తొట్రుపాటుతో, త్వరితగతిని వెళ్ళడానికి బదులు, ప్రభ కాళ్ళు తడబడ్డాయి. ఎలాగో వెళ్ళి తలుపు తీసింది. నిజంగా ఎదురుగుండా అతనే. త్వరగా లోపలికి వచ్చి తలుపు వేశాడు. తరవాత ప్రభకేసి ఎంతో ఆప్యాయంగా చూస్తూ, తెలియని ఉత్సాహంతో వణికిపోతున్న ఆమెని కౌగిట చేర్చుకున్నాడు. ఇలాంటి క్షణం కోసం ఎన్ని మాసాలుగా ఎదురుచూచింది! అన్ని మాసాలూ తన హృదయంపడ్డ క్షోభ యీ క్షణంతో మాయమయింది అనుకుంది. ఇక మీదట జరిగే ప్రతి క్షణం ఒక మధురానుభూతిగా తనలో నిలుస్తుంది అనుకుంది ప్రభ. ఇక మీదట ప్రతిక్షణం అయిపోతుందేమో అన్న ఆత్రంతో, గడిచిపోతే యిక రాదన్న ఉత్కంఠతో గడుపుతాం అనుకుంది ప్రభ. అతనూ తనలాగే ఎన్నాళ్ళనుంచి ఎదురు చూశాడో, యీ క్షణంకోసం? అవును మరి, తొలిరోజులలో తననిచూచిన తొలిరోజులలో అతని ముఖం జ్ఞాపకానికి తెచ్చుకుంది ప్రభ. ఒక ప్రక్కనుంచి ఆనందంతో విప్పారుతూనే యింకో ప్రక్కనుండి ఖిన్నపడేది

అతనిముఖం. తనని చూశానన్న ఆనందం, తన సాన్ని హిత్యాన్ని పొందలేకపోయానన్న విచారం, అలా అర్థం చెప్పకొనేది ప్రభ. "ఇటువంటి మిశ్రభావాలు నాలో జీర్ణించుకుపోయాయి" అంటూ ఎంతో యిదిగా రాశాడు అతను. అతని కేం తెలుసు తనుపడ్డబాధ అనుకొంది ప్రభ. చూసిన క్షణంలోనే, కనురెప్పపాటులోనే అతనిఎడ తనఎదలో రేగిన భావాలూ, అవి తన మనస్సులో మెదడులో కలిగించిన సంక్షోభం ఎలా చెప్తుంది ? ఇప్పుడు యీ క్షణంలో ఒండొరుల హృదయాలు అతి సన్నిహితంగా వున్న యీ క్షణంలో పాతకాలపు స్మృతులు కదలాడి, అప్రయత్నంగా కళ్ళు నీళ్ళతో నిండాయి. ఆ కంటినీరు అతని హృదయాన్ని కరిగించినట్లుంది. ఆమెను మరీ దగ్గరగా తీసుకున్నాడు. అతని కౌగిలిలో వుంటూ అతని హృదయంలో తలదాచుకొంటూ కూడా కన్నీరెందుకు తనకి అనుకొంది ప్రభ. అయినా యిప్పటిదాకా ఏ ఒక్కరికీ ఒక్కమాటా రాదేం ? తన హృదిలాగే అతని హృదయం ఆనందంతో, తెలియని ఆందోళనతో మూగవోయిందా ? అతనిమీద అపరిమితమైన జాలి పుట్టుకొచ్చింది. అతని కంఠాన్ని గట్టిగా కౌగిలించుకొంది ప్రభ.

ఇప్పుడిక నువ్వుతప్ప నా కింకెవరూ లేరు అంది, వినీ వినపడకుండా, కరిగిపోతున్న కంఠధ్వనితో. ఈ మాట లతన్ని ఆనందంలో ముంచుతాయని అనుకుంది. కాని మగవాడికి మోసగాడికి ఇలాంటి మాటలు మోటుగా వుంటాయి; హృదయంలో కోర్కెల ఆవేశాన్ని చల్లార్చేస్తాయి - అన్న

సంగతి ప్రభ తెలుసుకోలేదు. ఈ మాటలు మగవాడికి జ్ఞాపకం తెచ్చేది తను సంపాదించబోయే హక్కులను కాదు, తను నిర్వర్తింపవలసిన విధులను! ఈ మాటలు అతన్ని అంతే చేశాయి. అతను పైకి తేలలేదు. అస్పష్టంగా ఓ చిరునవ్వు నవ్వేడు. ఆ చిరునవ్వే తనని అంత సమ్మోహనపరచింది అనుకొంది ప్రభ. కాని ప్రభకంటె కొంచం ఎక్కువ అమాయకత్వంగల ఏ అమ్మాయేనాసరే ... ఆ విస్పష్టపు చిరునవ్వును చూచి ఏదైనా చేయవచ్చుగాని యితనిమాట నమ్మకూడదన్న నిజాన్ని సులువుగా గ్రహించేది. కాని ప్రభ శుద్ధ అమాయకురాలు. ఆ చిరునవ్వే స్వర్గం అనుకుంది.

"నువ్వు రడీగా వున్నావా? ఏదేనా సినిమాకి పోదామా?" ఆమె బుజాలు పట్టుకొని కొంచెం దూరంగా నిలిపి, ఆప్యాయంగా చూస్తూ అడిగాడు. ఈ గదిలోకి వచ్చాక అతను మాట్లాడిన మొదటి మాటలు. ఎంత సామాన్యమైన ప్రశ్న! అసలు జీవితానికి సంబంధించిన అనేక విషయాలను గురించి ఏ సంగతీ తేల్చుకోలేదు. కాని సినిమాకా? ఆ మాటలు తల్చుకొని ప్రభముఖం ఎర్రపడింది. గొంతుకలో ఏదో అడ్డుపడ్డట్లు బాధపడింది. శరీరం యావత్తూ ఏదో తెలియని ఆవేశంతో బిగుసుకుపోయింది. అతని పట్టునుండి విడిపించుకొని దూరంగా నిల్చుంది. కాని ఆమె చూపుమాత్రం అతనికళ్ళమీద వుంది. ఆ చూపులకి అతనికళ్ళు క్రిందికి వాలాయి.

"మరి మన పెళ్ళిసంగతి ఏంచేశావు?" కష్టపడి అంది. ఈ చిన్ని వాక్యం చెప్పడానికి ఆమె ఆత్మగౌరవం అంతా అమ్ముకొన్నట్లు అయింది. కాని ఆ వాక్యం ప్రభ అనకనూ తప్పలేదు; దానిఫలితం అనుభవించకా తప్పదు. "ఓ అదా!" అన్నాడు అతను. మరిచిపోయిన ఓ చిన్ని వివరాన్ని జ్ఞాపకంచేసినట్లు? "ఆ సంగతే చెప్తామనుకుంటున్నాను. అంత త్వరగా చేసుకోవడం పడదు. రూల్సు అన్నీ నిన్న రాత్రే కనుక్కొన్నాను. అందుకే తెల్లవారుఝాము బండికి ఇంకో ఊరు పోదాం" అని ఆగేడు అతను. ప్రభ నీరసంగా మంచంమీద కూలబడిపోయింది. లోలోన పొంగే దుఃఖంతో ఆమెశరీరం యావత్తూ కదలాడిపోతోంది. అతనింత నిర్లక్ష్యంగా తన వివాహాన్ని గురించి అంటాడని అనుకోలేదు ప్రభ. ఈ ప్రమాదాలమధ్య నిండు యౌవనంలో వున్నకన్య, జీవితపు లోతుపాతులు తెలియనిది-ప్రభ ఏకాంతంగా ఆలోచించుకోవలసివచ్చింది.

"ఈ ఊళ్లో మనం ఇంకా వుంటే మీవాళ్ళు వెతుక్కుంటూ వస్తే ప్రమాదం కాదా? తిరిగివచ్చి ఈ ఊళ్ళోనే పెళ్ళి చేసుకుందాం. అంతదాకా ఇక్కడేఎందుకు? అందుకే టిక్కట్లు అవీ సిద్ధంచేశాను" ప్రార్థనాపూర్వకంగా అంటున్నాడు అతను. ప్రభ కదల్లేదు. ముఖం చేతుల్లో కప్పుకొని అలాగే కూర్చుంది. దగ్గిరకి వెళ్ళి ఆమెభుజంమీద చెయి వేశాడు. ప్రభ త్రుళ్ళిపడి లేచి నిల్చుంది. ఇంతవరకూ అతనికౌగిలికోసం తహతహలాడిన ప్రభశరీరం యిప్పు డతని స్పర్శకి జలదరించింది. అదొక అవమానంకింద తోచింది.

'నన్ను తాకకు' అంటూ అరిచింది. దాని కతను చిరునవ్వు నవ్వేడు. 'సరే నే వెడుతున్నాను' అంటూ తిరిగి చూడకుండా అవతలికి వెళ్ళిపోయాడు అతను.

ప్రభ ఆ రూములో ఒంటరిగా కూర్చుని ఆలోచించింది. ఎవరిది తప్పు ? తను తొందరపడిందా? అవును. తీరా అటు అన్నిబంధాలూ తెంచుకొని వచ్చిన తను కొంచం ప్రశాంతంగా మాట్లాడవలసింది. ఇప్పుడు తన గతేంకాను? అతను తిరిగి రాకపోతే ?

ఈ ఆలోచనల భయంలో మునిగిపోయిన ప్రభ భయపడ్డట్లు జరగలేదు. అతను కొద్దిసేపట్లోనే తిరిగి వచ్చాడు. అతనిముఖం చాలా ప్రశాంతంగా, ఉత్సాహంగా వుంది. వస్తూనే 'చూడు, అనవసరంగా నువ్వు బాధపడ్డావు. నన్ను బాధపెట్టావు. రేపే ఎలాగో అలాగా పెళ్ళిచేసుకుందాంలే. ఈ ఒక్క రాత్రికూడా సరదాగావుండవా ప్రభా!' ప్రాధేయపడే కంఠస్వరంతో అడిగాడు. ఆ కంఠస్వరం విని అన్నీ మరిచిపోయింది ప్రభ.

"నిజంగానా ! ఏదీ ఒట్టువెయ్యి" అంటూ చెయ్యి చాపింది. ఒట్టువేశాడు. కాని చేతిని వదలలేదు. సంతోషంతో అతని హృదయంలో తల దాచుకొంది ప్రభ. ఆమె వెన్ను ఆప్యాయంగా రాస్తూ, "అంతట్లో అంతంత అనుమానాలు పెంచుకుంటా వెందుకు?" అంటూ గట్టిగా కౌగలించుకొన్నాడు.

ఆ రాత్రి ప్రభ సంతోషానికి మేరలేదు. తెల్లవారితే పెళ్ళిచేసుకుంటారు. ఇంకెవరూ తనని ఏమీ అనలేరు. అదే

ధైర్యంతో అతనికి తన సర్వస్వం అర్పించుకొంది. ఒక్క క్షణం కూడా తనకు దూరంకాకుండా అతన్ని తన కౌగిలి లోనే వుంచుకొంది. ఆ రాత్రి సౌఖ్యాల పరిధుల దాటి పయనించిన ప్రభ, ఇకమీదట నిత్యస్వర్గంలోనే వుండాలను కొంటూ తలపోసి కనులు మూసింది.

—కనులు తెరచి చుట్టూ కలియచూసేసరికి బాగా తెల్లవారిపోయిందని తెలుస్తూంది. కిటికీలోంచి ఎండ మంచం మీద పడుతోంది. ఆప్యాయంగా అతన్ని కౌగిట చేర్చు కొందామని చెయ్యి చాపింది. అక్కడ అతను లేడు. తిరిగి చూసింది. నిజంగానే అతను లేడు. కిందికి వెళ్ళి వుంటాడు అనుకొంది. కాని ఏదో తెలియని భయం ఆమెను ఆవహించింది. ఏమో! అతను వెళ్ళిపోతే? ఈ ఆలోచన రాగానే త్వరగా లేచింది ప్రభ. కాలకృత్యాలు తీర్చుకొని కూర్చుంది అతనికోసం. నిజమే అతను వెళ్ళిపోయాడు. లేకుంటే, రాత్రంతా ఒక్క క్షణమేనా తనని వదలని అతను, తెల్లవారకుండానే వెళ్ళి యింత పొద్దుపోయినా రాకుండా వుంటాడా! వూహించుకొన్నకొద్దీ భయంగావుంది. అదే భయంతో కొంచంసేపు నడుము వాలుద్దామని మంచం దగ్గరకి వెడితే, రాత్రి గుర్తుకివచ్చి సిగ్గుతో కృంగిపోయింది. హఠాత్తుగా ఆ మొకల్లు దిండుపక్కన వున్న కవరుమీద పడ్డాయి. ఆత్రంగా తీసింది, మూడు పదిరూపాయలనోట్లు ఓ చిన్న వుత్తరం వున్నాయి నాల్లో. అతనే వ్రాశాడు. "వివాహంచేసుకొనే కోర్కె స్తోమతూకూడా లేవు నాకు. ఏదో చుర్చు నన్ను, నిన్ను నేనూ కోరుకొన్నాం. అనుభ

వించాం. యిక మరచిపో. ఈ డబ్బుతో మీ ఊరికి టిక్కట్టుకొని యింటికి వెళ్ళు. ఇలాంటివి యీ ప్రపంచంలో సర్వ సాధారణమే. దీనిని గురించి నువ్వు అంతర్యంలో బాధపడనక్కరలేదు." పేరూ లేదు. ఊరూ లేదు. అంతే రాశాడు. అది చదివిన ప్రభ అచేతనంగా వుండిపోయింది.

గోడగడియారం దగ్గిర దగ్గిర పదిగంటలు చూపుతోంది. గడచిన ఇరవై నాలుగు గంటలలో తన జీవితంలో ఎంత మార్పు? ఇప్పుడింకేంచేయడానికి తోచలేదు ప్రభకి. తెచ్చిన చిన్న సూట్ కేసు సర్దేసుకొని గబ గబ మెట్లు దిగి పేవుమెంటుమీదకి వచ్చింది. ఎటుపోవటం? ఏ ఆలోచనా తోచక అలాగే నడుస్తూంది. ఎన్నడూ ఇంతకుముందు పట్నం ఒంటరిగా రాని ప్రభ, యిన్నాళ్లూ ఏ కల్మషం అంటని ప్రభ ఈనాడు లోకందృష్టిలో పతిత; చెడిపోయిన అమ్మాయి. ఎక్కడో ఆలోచనలలో మునిగి నడిచిపోతున్న ప్రభని ఎవరో పిలిచారు. తలెత్తి చూసింది. పోలీసు. ప్రభకి భయం వేసింది. నవ్వు వచ్చింది. రోడ్డుపక్కన పేవుమెంటుమీద నడిచిపోతున్న తనను పోలీసా ఆపడం!

"ఎందుకూ?" అనడిగింది.

"నీదేవూరు? ఎక్కడికి పోతున్నావు? ఎవరితోవచ్చావు?" అనడిగాడు పోలీసు.

'నీకెందుకు?' కటువుగా అంది ప్రభ.

"నాకెందుకులే మేజిస్ట్రేటుకే చెప్పుగాని రా" అన్నాడు పోలీసు. కోర్టు, మేజిస్ట్రేటు అంటే కాళ్ళు వణికాయి ప్రభకి.

అయినా పోలీసు వెంట నడిచింది. రోడ్డుమీద అందరూ తన కేసే చూస్తున్నట్లు, నవ్వుకొంటున్నట్లు అనిపించింది.

కోర్టులో మేజిస్ట్రేటు అన్నీ అడిగాడు. చివరికి విజిలెన్సు హోములో డిటెయిన్ చెయ్యమని ఉత్తర్వు చేశాడు.

విజిలెన్సు హోములో ప్రభకి సహచరులకి కొదువ లేదు. చాలామంది తనలాగా మోసపోయినవాళ్ళే. మగవాళ్ళంతా యింతేకాబోలు అనుకుంది ప్రభ. విజిలెన్సు హోము సూపరెంటు అమ్మకి ఉత్తరం వ్రాసింది. తను వస్తానని, తన కూతుర్ని జాగ్రత్తగా చూసుకోమనీ ఉత్తరం వ్రాయించిందట అమ్మ. అమ్మ వస్తుందా? తన నీ స్థితిలో చూచి అమ్మ ఏమంటుంది? తనని యింటికి తీసుకువెళ్ళి ఏం చేస్తుంది అమ్మ? ఈ ఆలోచనలతోపాటే దుఃఖం కూడా పొంగి పొరలింది ప్రభకి.

పట్నానికి ఎన్నడూ ఒంటరిగా రానిది వచ్చింది; పట్నంలో ఎలావుంటుందో చూచింది. యిక తనకి మిగిలింది-యిలా వచ్చినందుకూ, చూచినందుకూ పశ్చాత్తాపమే. ఈ పశ్చాత్తాపంతో ప్రభచేసిన పాపం ప్రక్షాళితం కాలేదా? ప్రభకి యింకెవరి హృదయంలోనూ స్థానం లభించదా? అని ప్రశ్నించుకొంటే లోకంలో స్త్రీలపట్ల అంతటి సానుభూతి దొరుకుతుందా అంటూ నవ్వుతారు కొందరు. కాని కాలం గడుస్తున్నకొద్దీ, పతితల హృదయాలలోని గాయాలు మానుతున్నకొద్దీ లోకంలో సానుభూతికి కొదువలేదని తెలుసుకుంటారు. నిరాశావాదులు కాదు ఈ నిజాన్ని తెలుసు

కోనేది-ఆశావాదులే. ప్రభ అటు ఆశావాదీకాదు, నిరాశావాదీ కాదు. అందుకే అమ్మకి ఇంకా తనమీద ప్రేమ వుందంటే నమ్మలేకుండావుంది. నమ్మకుండానూ వుండలేక పోతూంది.

కాలంతోపాటే ప్రభజీవితం సాగుతూంది. అమ్మ వచ్చి ప్రభని ఇంటికి తీసుకు వెడుతుంది. చుట్టాలకీ పక్కాలకీ అమ్మాయి పట్నపు వింతలు చూడబోయిందని చెబుతుంది. తనకు జరిగిన అవమానాన్ని మరిచిపోయి తనని ప్రేమించే హృదయంకోసం అన్వేషణ ప్రారంభిస్తుంది ప్రభహృదయం. ఇది ప్రకృతి సహజం. అదే మానవజీవితం. మానవ జీవితంలో అవమానానికి స్థిరస్థానం లేదు. ఉండేవుంటే ఏ స్త్రీ అంతకాలం బ్రతకదు, ఏ పురుషుడూ అంతకాలం బ్రతకడు. నిజం అంతే. అదే మానవజీవితం.